# సాక్షి పల్నాడు

గురువారం । 13 । మార్చి । 2025






## వైభవంగా శతచండీ మహాయాగం

సత్తెనపల్లి: పట్టణంలోని త్రిశక్తి దుర్గాపీఠంలో శ్రీశ్రీశ్రీ హనుమత్‌స్వామి ఆధ్వర్యంలో పంచాయతన పూర్వక నవదుర్గాత్మక శత చండీ మహాయాగం బుధవారం నిర్వహించారు.



## 'బార్' ఎన్నికలకు ఏడు నామినేషన్‌లు

గుంటూరు లీగల్: గుంటూరు బార్ అసోసియేషన్ ఎన్నికలకు సంబంధించి బుధవారం ఏడుగురు అభ్యర్థులు వివిధ పోస్టులకు నామినేషన్లు దాఖలు చేశారు.



## రేపు కోటప్పకొండ గిరి ప్రదక్షిణ

నరసరావుపేట రూరల్: ఈనెల 14వ తేదీ త్రికోటేశ్వర స్వామి గిరిప్రదక్షిణ ప్రారంభమవుతుందని గిరి ప్రదక్షిణ సేవా సమితి అధ్యక్షుడు వెంకయ్య చౌదరి బుధవారం తెలిపారు.

## రంజాన్ వేళలు

| | ఇఫ్తార్ (గురు) | సహర్ (శుక్ర) |
|---|---|---|
| నరసరావుపేట | 6.25 | 5.03 |
| గుంటూరు | 6.23 | 5.01 |
| బాపట్ల | 6.23 | 5.01 |

## న్యూస్‌రీల్

### గుత్తికొండ బిలంలో హైకోర్టు న్యాయమూర్తి పూజలు

పిడుగురాళ్ల: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన గుత్తికొండ బిలాన్ని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి టి.సుజాత బుధవారం సందర్శించారు. గుత్తికొండ బిలంలోని పుణ్యక్షేత్రంలో ఆమె ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం హైకోర్టులో గుమస్తాగా పనిచేస్తూ ఇటీవల మృతిచెందిన మండలంలోని జూలకల్లు గ్రామానికి చెందిన సంధ్యా నాయక్ కుటుంబ సభ్యులను వారి స్వగృహంలో పరామర్శించారు. ఆమె వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

### బ్రిడ్జి నిర్మాణ పనులు పరిశీలించిన ఆర్డీఓ



అచ్చంపేట: మండలంలోని మాదిపాడులో ప్రభుత్వ భూములను ఆర్డీఓ జి.రమాకాంత్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. మాదిపాడు నుంచి పులిచింతల ప్రాజెక్టు వరకు నిర్మాణంలో ఉన్న రోడ్డుకు అంతరాయం కలుగచేస్తున్న వారి భూములను పరిశీలించి, రోడ్డు నిర్మాణానికి ఎలాంటి ఆటంకం కలిగించవద్దని సూచించారు. అనంతరం కృష్ణానదిపై మంజూరైన వంతెన నిర్మాణానికి కావలసిన అనుమతులు, భూసేకరణ తదితర వివరాలను కాంట్రాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో సుమారు 20 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూములుండగా వాటిని ఏవిధంగా వినియోగించుకోవాలనే విషయంపై తహసీల్దార్‌తో చర్చించారు. వారి వెంట వీఆర్వోలు, గ్రామ సచివాలయ సిబ్బంది, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

### యార్డులో 1,40,254 మిర్చి బస్తాలు విక్రయం



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 1,39,436 బస్తాల మిర్చి రాగా గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,40,254 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల సగటు ధర రూ.9,500 నుంచి రూ.14,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాలకు సగటున ధర రూ.10,000 నుంచి రూ.14,000 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చి రూ.5,000 నుంచి రూ.7,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 68,733 బస్తాలు నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక తెలిపారు.

### కబ్జాపై కదిలిన యంత్రాంగం

**అక్రమాలకు పాల్పడిన అధికారులకు నోటీసులు**

సాక్షి ఎఫెక్ట్

గురజాల రూరల్: గురజాల జగనన్న కాలనీలో మొత్తం 70 సెంట్ల స్థలాన్ని కూటమి నేతలు కబ్జా చేసిన వైనంపై రా'జాగా' కబ్జా అనే శీర్షికతో బుధవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. అక్రమాలకు పాల్పడిన పలువురు అధికారులకు ఉన్నతాధికారులు నోటీసులు జారీ చేశారు. పలువురికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ వి.మురళీకృష్ణ మాట్లాడుతూ గతంలో రీ సర్వే సరిగ్గా చేయని ఇరువురు సర్వేయర్లకు, జగనన్న కాలనీని అక్రమ రిజిస్ట్రేషన్లకు సహకరించినే ఆరోపణలు ఎదుర్కొంటున్న వీఆర్వోకు షోకాజ్ నోటీసులు అందించామన్నారు. ఈ విషయంలో ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు. సర్వే చేయించి పూర్తిగా విచారణ జరిపిస్తామన్నారు. అక్రమ రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు విచారణలో తేలితే రిజిస్ట్రేషన్లు రద్దు చేస్తామన్నారు.

# వంచనపై యువాగ్రహం

## వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో యువత పోరు

- పార్టీ జిల్లా కార్యాలయం నుంచి పల్నాడు జిల్లా కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ
- భారీగా హాజరైన విద్యార్థులు, నిరుద్యోగులు, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు
- కూటమి ప్రభుత్వ తీరును ఎండగట్టిన నేతలు
- యువత పక్షాన నిరంతర పోరాటాలు చేసి అండగా నిలుస్తామని భరోసా
- ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్
- ర్యాలీ నేపథ్యంలో భారీగా మోహరించిన పోలీసులు
- జేసీ సూరజ్‌కి వినతిపత్రం అందజేత

కొలువు కలలు కల్లలవగా.. భృతి భ్రాంతిగా మారగా.. భవిష్యత్తు అంధకారంగా గోచరించగా.. దగా పడ్డ నిరుద్యోగి కూటమి ప్రభుత్వంపై గళమెత్తాడు. ఉద్యో'గాలం' వేసి పీఠమెక్కిన నేతలు ఇదిగో.. అదిగో అంటూ ఊరించి ఉసూరుమనిపించగా.. ఎన్నో ఆశలు.. మరెన్నో ఆకాంక్షలతో వేలకు వేలు కట్టి కోచింగ్ తీసుకుంటున్న యువత ఆక్రోశం కట్టలు తెంచుకుని వీధుల్లో నినాదమై పలికింది. గత ప్రభుత్వ హయాంలో ఐదేళ్లు నిశ్చింతగా, నిబ్బరంగా ఫీజుల విషయమై గాబరా లేక చదువుపై దృష్టిపెట్టగా.. నేడు ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక.. ఎప్పుడు చెల్లిస్తారో తెలీక.. కళాశాల యాజమాన్యాల అనుమానపు చూపులు.. అవమానపు మాటలు తట్టుకోలేక అత్యంత ఒత్తిడితో చదువు బండి లాగిస్తున్న విద్యార్థులు సెమిస్టరు దాటిపోయినా ఒక్క రూపాయి ఫీజు కూడా చెల్లించని సర్కారు తీరుపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో జరిగిన యువత పోరులో పెద్ద ఎత్తున నిరుద్యోగులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ప్రశ్నించారు. హామీలు నెరవేర్చేవరకు పోరుబాట సాగిస్తామని హెచ్చరించారు.



పార్టీ జిల్లా కార్యాలయానికి ద్విచక్రవాహనాలతో ర్యాలీగా బయలుదేరిన వైఎస్సార్ సీపీ శ్రేణులు

సాక్షి, నరసరావుపేట, నరసరావుపేట రూరల్: చంద్రబాబు ప్రభుత్వం విద్యార్థులకు, నిరుద్యోగ యువతకు చేసిన మోసాన్ని ఎండగడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన యువత పోరు కార్యక్రమం పల్నాడు జిల్లాలో విజయవంతమైంది. ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపుమేరకు జిల్లా కేంద్రంలో యువత పోరు కార్యక్రమానికి యువత, తల్లిదండ్రులు, పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. కూటమి ప్రభుత్వం యువతకు చేస్తున్న అన్యాయాన్ని తెలియజేస్తూ బుధవారం ఉదయం 11 గంటలకు పార్టీ జిల్లా కార్యాలయం నుంచి కలెక్టరేట్‌కు భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, మాజీ మంత్రి విడదల రజని, మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, బొల్లా బ్రహ్మనాయుడు, కాసు మహేష్ రెడ్డి, నంబూరు శంకరరావు, సత్తెనపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డిల ఆధ్వర్యంలో వేలాది మంది కదంతొక్కి యువతకు భరోసానిచ్చారు. ర్యాలీలో కార్యకర్తలు పెద్దఎత్తున నినాదాలు చేస్తూ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. అనంతరం పార్టీ ముఖ్యనేతలు పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరేకు వినతిపత్రం అందజేశారు.

**భారీగా మోహరించిన పోలీసులు...**

వైఎస్సార్ సీపీ చేపట్టిన యువత పోరుకు పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు వస్తున్నారన్న సమాచారంతో జిల్లా కేంద్రంలో పెద్ద సంఖ్యలో పోలీసులు మోహరించారు. పార్టీ కార్యాలయానికి వెళ్లే మార్గంలో బారికేడ్లు ఏర్పాటు చేసి పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. శాంతియుతంగా వెళ్తున్న ర్యాలీని కలెక్టరేట్ కార్యాలయానికి వెళ్లకుండా పోలీసుల గేట్లు మూసి అడ్డుకున్నారు. తమ సమస్యలు చెప్పుకునేందుకు వస్తే బారికేడ్లు అడ్డు పెట్టడంపై విద్యార్థులు, తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేశారు. మేనిఫెస్టోలో పొందుపర్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. చంద్రబాబు డౌన్ డౌన్ అంటూ ప్లకార్డులను ప్రదర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు పడాల సాంబశివారెడ్డి, దేవెళ్ల రేవతి, డా.చింతలపూడి అశోక్‌కుమార్, కందుల శ్రీకాంత్, గుజ్జర్లపూడి అకాష్‌కుమార్, ఖాజావలీ మాస్టర్ తదితరులు పాల్గొన్నారు.



జేసీ సూరజ్ గనోరేకు వినతిపత్రం అందిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పీఆర్కే, విడదల రజిని, డాక్టర్ గోపిరెడ్డి, కాసు మహేష్‌రెడ్డి, బొల్లా బ్రహ్మనాయుడు, శంకరరావు, గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి



పల్నాడు జిల్లా ఎస్పీ కార్యాలయం వద్ద భారీగా మోహరించిన పోలీసులు

### పేద విద్యార్థులపై కక్ష సాధింపు

ఉన్నత విద్య అభ్యసిస్తున్న పేద విద్యార్థులపై కక్ష సాధింపులో భాగంగానే కూటమి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయడం లేదు. దివంగత వైఎస్సార్ ప్రారంభించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ ద్వారా పేద వర్గాల నుంచి ఎంతో మంది డాక్టర్లు, ఇంజినీర్లు, శాస్త్రవేత్తలు అయ్యారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను కొనసాగిస్తూ మాజీ సీఎం వైఎస్ జగన్ విద్యాదీవెన, వసతి దీవెన పథకాలను సైతం అమలు చేశారు. కూటమి ప్రభుత్వం పేద విద్యార్థులను రోడ్డుపై నిలబెట్టే పరిస్థితికి తీసుకువచ్చింది. తక్షణం ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు, బకాయిలు విడుదల చేయాలి. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతిని వెంటనే అందించాలి.

– పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు

### వైద్యవిద్యను వ్యాపారం చేసే కుట్ర...

దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా రాష్ట్రానికి 17 మెడికల్ కళాశాలలను మాజీ సీఎం వైఎస్ జగన్ తీసుకువచ్చారు. ఈ కళాశాలల నిర్మాణానికి రూ.8,500కోట్లు మంజూరు చేశారు. ఇందులో భాగంగా ఐదు మెడికల్ కళాశాలలు నిర్మాణాలు పూర్తిచేసుకొని తరగతులు ప్రారంభించాం. రెండవ ఫేజ్‌లో మరో ఐదు మెడికల్ కళాశాలలు ఈ ఏడాది అందుబాటులోకి రావాల్సి ఉంది. కూటమి ప్రభుత్వానికి పేద ప్రజల ఆరోగ్యంపై చిత్తశుద్ధి లేకపోవడంతో అవి అందుబాటులోకి రాలేదు. మిగిలిన ఏడు కళాశాలలకు కేంద్ర ప్రభుత్వం అనుమతులు వచ్చినా కూటమి ప్రభుత్వం మాకొద్దని చెప్పడం విడ్డూరం. మెడికల్ కళాశాలలను ప్రైవేటుకు అప్పగించేందుకు కూటమి ప్రభుత్వం యత్నిస్తోంది. గత ఐదేళ్లలో ఫీజురీయింబర్స్‌మెంట్‌కు రూ.19వేల కోట్లు ఖర్చు చేశాం. కూటమి ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

– విడదల రజిని, మాజీ మంత్రి

### ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

ఫీజు రీయింబర్స్‌మెంట్ నగదు రాకపోవడంతో విద్యార్థులను కళాశాలలు వేధిస్తున్నాయి. గత ఏడాది బకాయిలతో పాటు ఈ ఏడాది నిధులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసి విద్యార్థులను ఆదుకోవాలి. 20లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని, నిరుద్యోగ భృతి నెలకు రూ.3వేలు ఇస్తామని ఎన్నికల హామీ ఇచ్చారు. పది నెలలు పూర్తవుతున్నా ఒక్క ఉద్యోగం ఇవ్వకపోగా నిరుద్యోగ భృతి అమలు చేయలేదు. కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా 2700 సీట్లు వైద్య విద్యలో రాష్ట్రం కోల్పోయే దుస్థితి వచ్చింది.

– డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యే

### ప్రభుత్వ మెడికల్ కళాశాలలను అమ్ముకుంటున్నారు...

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మొదటి బడ్జెట్‌లోనే పిడుగురాళ్ల మెడికల్ కాలేజీకి రూ.66కోట్లు కేటాయించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరో రూ.400కోట్లు నిధులు విడుదల చేయడంతో పిడుగురాళ్లలో 50 ఎకరాల్లో మెడికల్ కాలేజీ నిర్మాణాలు 90 శాతం పూర్తయ్యాయి. పరికరాలు తీసుకువచ్చి డాక్టర్లు, సిబ్బందిని నియమించి 2025లో ఆసుపత్రిని ప్రారంభించాల్సి ఉండగా, అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పనులన్నీ నిలిపివేసి ప్రైవేటు వ్యక్తులకు మెడికల్ కళాశాలను అమ్ముకునేందుకు యత్నిస్తోంది.

– కాసు మహేష్‌రెడ్డి, గురజాల మాజీ ఎమ్మెల్యే

### రాష్ట్రంలో శాంతిభద్రతలు దిగజారాయి

వినుకొండ రూరల్ మండలం ఏనుగుపాలెంకు చెందిన మహిళపై ఇటీవల లైంగికదాడి చేసి హత్య చేస్తే ఇప్పటి వరకు నిందితులను పోలీసులు గుర్తించలేదు. దీనిపై మృతురాలి భర్త, పిల్లలతో జిల్లా ఎస్పీని కలిసి ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు పురోగతి లేదు. పోలీసులు విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలి. రాష్ట్రంలో శాంతి భద్రతలు దారుణంగా ఉన్నాయి. కూటమి ప్రభుత్వం ఎవరినీ వదిలిపెట్టకుండా వేధిస్తుంది. తమతోపాటు వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు అన్నిటికీ సిద్ధంగా ఉన్నారు.

– బొల్లా బ్రహ్మనాయుడు, వినుకొండ మాజీ ఎమ్మెల్యే

### విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతీస్తున్న సర్కారు

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకుండా విద్యార్థుల భవిష్యత్‌ను దెబ్బతీసేలా కూటమి ప్రభుత్వం యత్నిస్తోంది. పేదలకు కార్పొరేట్ విద్య అందించేందుకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం తీసుకు వచ్చారు. దానిని మాజీ సీఎం వైఎస్ జగన్ కొనసాగించారు. విద్య, వైద్యం కోసం గత ప్రభుత్వం అత్యధికంగా ఖర్చు చేసింది. గతానికి ఇప్పటికి తేడాను ప్రతి పాఠశాలలో మనం చూడవచ్చు.

– నంబూరు శంకరరావు, పెదకూరపాడు మాజీ ఎమ్మెల్యే

### పేదలను ఉన్నత విద్యకు దూరం చేసే కుట్ర

పేద విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ఎంతో మేలు చేస్తుంది. దీనిని ప్రభుత్వం సక్రమంగా అమలు చేయకపోతే ప్రతిభ ఉన్న ఎంతో మంది విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతారు. ఈ పథకం ద్వారా ఉన్నత విద్యను అభ్యసించిన వారు గ్రామాల్లో ఎంతో మందికి మార్గదర్శకంగా ఉంటారు. ఈ పథకాన్ని నీరుగార్చితే పేద విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుంది. పిడుగురాళ్ల మెడికల్ కాలేజీ వలన ఈ ప్రాంతానికి ఎంతో మేలు. దీన్ని ప్రైవేటు పరం చేస్తే పేదలు తీవ్రంగా నష్టపోతారు.

– డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి, సత్తెనపల్లి ఇన్‌చార్జి

# ప్రజా సమస్యలే పార్టీ అజెండా

**ఘనంగా వైఎస్సార్ సీపీ ఆవిర్భావ వేడుకలు**

- నరసరావుపేటలోని జిల్లా కార్యాలయంలో పార్టీ పతాకావిష్కరణ
- హాజరైన జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు
- జిల్లావ్యాప్తంగా 15వ ఆవిర్భావ సంబరాలు
- వేడుకగా నిర్వహించిన పార్టీ శ్రేణులు



జిల్లా కార్యాలయంలో పార్టీ జెండాను ఎగురవేస్తున్న జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి, చిత్రంలో విడదల రజిని, డాక్టర్ గోపిరెడ్డి, కాసు మహేష్‌రెడ్డి, బొల్లా బ్రహ్మనాయుడు, శంకరరావు, డాక్టర్ గజ్జలసుధీర్ భార్గవ్‌రెడ్డి

సాక్షి, నరసరావుపేట: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 15వ ఆవిర్భావ వేడుకలు మంగళవారం పల్నాడు జిల్లావ్యాప్తంగా ఘనంగా జరిగాయి. నరసరావుపేటలోని పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన వేడుకల్లో జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, మాజీ మంత్రి విడదల రజని, మాజీ ఎమ్మెల్యేలు గోపిరెడ్డి, కాసు మహేష్ రెడ్డి, బొల్లా బ్రహ్మనాయుడు, నంబూరు శంకరరావు, సత్తెనపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి గజ్జల సుధీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. భారీగా హాజరైన పార్టీ నేతలు, కార్యకర్తలతో మంగళవారం ఉదయం 11 గంటలకు పండుగ వాతావరణం నెలకొంది. జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు పార్టీ జెండాను ఆవిష్కరించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి నేతలు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ 15 సంవత్సరాల ప్రస్థానాన్ని నేతలు, కార్యకర్తలు గుర్తుచేసుకున్నారు. జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి మాట్లాడుతూ ఆవిర్భావ కార్యక్రమానికి వచ్చిన నేతలు, కార్యకర్తలకు అభినందనలు తెలిపారు. ప్రజల అభ్యున్నతి కోసం వైఎస్సార్ సీపీ నిరంతరం పోరాడుతుందన్నారు. అందుకే కోట్లాది మంది అభిమానుల మనసు గెలుచుకొందని వ్యాఖ్యానించారు. కూటమి ప్రభుత్వంలో అన్యాయానికి గురవుతున్న రైతులు, మహిళలు, విద్యార్థులు, యువత, ఉద్యోగులు ఇలా అన్ని వర్గాల తరపున వైఎస్సార్ సీపీ రాజీలేని పోరాటం చేసి వారి హక్కులు కాపాడుతుందన్నారు. వారందరి సమస్యలే పార్టీ అజెండాగా పార్టీ అధినేత వైఎస్ జగన్‌తో కలిసి తాము ముందుకు సాగుతామన్నారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా మరోసారి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యేలా కార్యకర్తలు శ్రమించడం అభినందనీయమన్నారు. రానున్న వైఎస్ జగన్ ప్రభుత్వం 2.0లో కార్యకర్తల కష్టానికి తగిన ప్రతిఫలం తప్పక దక్కుతుందని ఆయన పేర్కొన్నారు.



మాట్లాడుతున్న పిన్నెల్లి

# ఈతకు వెళ్లి ఇద్దరు విద్యార్థులు మృతి

- పెట్లూవారి పాలెం సమీపంలోని 10 ఆర్ మేజర్ కాల్వ వద్ద ఘటన
- ఇద్దరూ బాపట్ల జిల్లాకు చెందినవారే..



ఘటనా స్థలంలో విద్యార్థుల మృతదేహాలు

నరసరావుపేట రూరల్: ఈతకు వెళ్లి ఇద్దకు విద్యార్థులు మృత్యువాత పడిన ఘటన మండలంలోని పెట్లూరివారిపాలెం సమీపంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాపట్ల జిల్లా కురిచేడుకు చెందిన గోపి(19) నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. అదేవిధంగా అద్దంకి మండలం వేంపరాలకు చెందిన తేజ్‌కుమార్(19) ఏఎం రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో డిప్లొమా తృతీయ సంవత్సరం చదువుతున్నారు. వీరిద్దరూ పట్టణంలోని ప్రైవేటు హస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్నారు. బుధవారం సాయంత్రం గోపి, తేజ్‌కుమార్‌లు మరో ఇద్దరు స్నేహితులతో కలిసి పెట్లూరివారిపాలెం సమీపంలోని 10 ఆర్ మేజర్ కాలువలో ఈతకు వెళ్లారు. గోపి, తేజ్‌కుమార్‌లకు ఈత రాకపోయినా నీటి ప్రవాహం తక్కువగా ఉండటంతో కాలువలో దిగారు. కాలువ డ్రాప్ పైనుంచి ఇద్దరు నీటిలోకి దూకారు. డ్రాప్ క్రింద ప్రాంతంలో నీటి ఉధృతి కారణంగా మట్టి కోతకు గురై లోతు ఎక్కువగా ఉంటుంది. దీనిని వారు గమనించకపోడంతో ఈత రాక నీటమునిగారు. కాలువ కట్టపై ఉన్న వీరి స్నేహితులు గమనించి కేకలు వేశారు. మిర్చిపొలాల్లో కోతకు వచ్చని కూలీలు అక్కడకు చేరుకొని కాలువలోకి దిగి ఇరువురిని ఒడ్డుకు చేర్చారు. అప్పటికే ఇద్దరూ మృతిచెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కిశోర్ తెలిపారు.

# గృహ నిర్మాణ లబ్ధిదారులకు అదనపు ఆర్థికసాయం

**సద్వినియోగం చేసుకొని నిర్మాణాలు పూర్తి చేసుకోవాలన్న కలెక్టర్**

నరసరావుపేట: హౌసింగ్ పీఎంఏవై అర్బన్, గ్రామ లబ్ధిదారులు, పీఎం జన్‌మన్ లబ్ధిదారులకు చెందిన నిర్మాణంలో ఉన్న గృహాలకు అదనపు ఆర్థిక సహాయం చేసేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2016–17వరకు పీఏఎవై అర్బన్ బ్లాక్, 2016–17 నుంచి 2021–22వరకు పీఎంఏవై గ్రామీణ, 2023–24 నుంచి 2025–26వరకు అమల్లో ఉన్న పీఎం జన్‌మన్ పథకాల లబ్ధిదారులు, 2024 డిసెంబరు 10 నాటికి వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న ఇళ్ల లబ్ధిదారులు దీనికి అర్హులని తెలిపారు. అదనపు ఆర్థిక సహాయం అందజేసేందుకు లబ్ధిదారుల కుల ధ్రువీకరణ చేయబడుతుందన్నారు. ఎస్సీ, బీసీలకు రూ.50వేలు, ఎస్టీలకు రూ.75వేలు, పీవీటీజీలకు రూ.లక్ష అదనంగా అందిస్తామన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న అదనపు ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకొని గృహనిర్మాణాలను పూర్తిచేసుకోవాలని కలెక్టర్ కోరారు.

## క్లుప్తంగా

### ‘పది’ విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం

**నరసరావుపేట:** ఈనెల 17వ తేదీ నుంచి ఏప్రిల్ ఒకటి వరకు జరిగే పదవ తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు జిల్లాలోని పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు ఆర్టీసీ బస్సులో ఉచితంగా ప్రయాణించవచ్చని పల్నాడు జిల్లా ప్రజారవాణాధికారి ఎం.మధు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హాల్ టికెట్ ఉన్న ప్రతి విద్యార్థి ఇంటి నుంచి పరీక్ష కేంద్రం వరకు బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

### సరస్వతి భూముల్లో మట్టి అక్రమ తవ్వకాలు పరిశీలన

**మాచవరం:** మండలంలోని సరస్వతి పవర్ లిమిటెడ్ కంపెనీకి చెందిన భూముల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయనే ఫిర్యాదు మేరకు మైనింగ్, రెవెన్యూ అధికారులు బుధవారం పరిశీలించారు. మండలంలోని వేమవరం, చెన్నాయపాలెం, పిన్నెల్లి గ్రామాల్లో సరస్వతి పవర్ లిమిటెడ్‌కు చెందిన భూముల్లో గత కొంతకాలంగా అక్రమంగా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా లోతైన గుంతలు తీస్తూ దళారులు అక్రమాలకు పాల్పడుతున్నారు. కంపెనీకి చెందిన వ్యక్తులు విషయాన్ని మైనింగ్, రెవెన్యూ అధికారులు దృష్టికి తీసుకెళ్లడంతో పరిశీలన చేపట్టారు. ఈసందర్భంగా అధికారులు మాట్లాడుతూ అక్రమ మట్టి తవ్వకాలు జరుగుతున్న భూములను గుర్తిస్తున్నామని, మరో రెండు రోజుల పాటు పరిశీలన చేపట్టనున్నట్లు తెలిపారు. మైనింగ్ ఆర్ఐ శివలీల, సర్వేయర్ దయానా, మండల సర్వేయర్ సాల్మన్‌రాజు, ఆర్ఐ కోటేశ్వరావు పాల్గొన్నారు.

### స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రను విజయవంతం చేయండి

**నరసరావుపేట:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెల మూడో శనివారం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారులు ఈనెల 15వ తేదీ మూడో శనివారం కార్యక్రమంలో పాల్గొనాలని, ముందురోజు రాత్రి ఆయా మండలాలకు వెళ్లి రాత్రిబస చేయాలన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలను భాగస్వామ్యం చేసి విజయవంతం చేయాలని ఆదేశించారు.

### రాష్ట్రం బిహార్‌లా మారుతోంది



ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం పక్కన పెట్టి యువతను మోసం చేసింది. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగ భృతి అటకెక్కించింది. యువతకు ఇచ్చిన హామీలకు నిధులు విడుదల చేయటం లేదు. పరిస్థితి ఇలాగే కొనసాగితే రాష్ట్రం మరో బిహార్‌లా మారుతుంది. చదువుకున్న వారు సైతం వలస బాట పట్టాల్సి వస్తుంది. – షేక్ లుక్‌మెన్, నిరుద్యోగి

### భృతి లేదు..అంతా భ్రాంతే



నిరుద్యోగ భృతి అంతా భ్రాంతిలా ఉంది. ఎన్నికల సమయంలో ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి అంటూ కూటమి నాయకులు ఊదరగొట్టారు. ఇప్పుడు చూస్తే 9 నెలలుగా ఆ ఊసే లేదు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పాత బకాయిలు విడుదల చేయటం లేదు. యువతను కూటమి ప్రభుత్వం నిట్టనిలువునా ముంచింది. – బూదాల కళ్యాణ్, నిరుద్యోగి

### ఇంకెంత కాలం కావాలి?



కూటమి నేతలు ఎన్నికల సమయంలో తాము ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు ఇంకెంత సమయం కావాలి. అధికారంలోకి వచ్చి ఇన్ని నెలలైనా ఇంకా గత ప్రభుత్వంపై విమర్శలతోనే కాలం గడుపుతున్నారు. అడిగితే కేసులు పెడుతున్నారు. ఇదెక్కడి న్యాయం? ఇచ్చిన హామీలనే కదా నెరవేర్చమంటున్నాం. – జొన్నగిరి రామాంజనేయులు, నిరుద్యోగి

### ప్రభుత్వ తీరు బాగోలేదు..



ప్రభుత్వం తీరు ఏమాత్రం బాగోలేదు. విద్యార్థులకు రావలసిన బకాయిలను విడుదల చేయటం లేదు. ఫీజులు చెల్లించేందుకు డబ్బులు పడటం లేదు. చాలా ఇబ్బంది పడాల్సి వస్తోంది. అభివృద్ధి పనులు కూడా జరగటం లేదు. విద్యార్థులపై ప్రభుత్వం ఉదారంగా వ్యవహరించి వారికి రావలసిన బకాయిలను వెంటనే విడుదల చేయాలి. – ఎస్.బాలకృష్ణ, విద్యార్థి

### విద్యార్థులను ముంచింది



కూటమి ప్రభుత్వం విద్యార్థులను ముంచింది. ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఇచ్చిన హామీలకు దిక్కు లేకుండా పోయింది. ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన పథకాలు అమలు కావటం లేదు. ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేయాలి. లేదంటే విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారుతుంది. – షేక్ ఖాజా, విద్యార్థి

## వైఎస్సార్ విగ్రహానికి పూలదండ వేయడానికీ
# అనుమతులు కావాలా?

**పోలీసుల తీరుపై వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పీఆర్కే అభ్యంతరం**



పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని కారు దిగకుండా అడ్డుకుంటున్న ఎస్ఐ సీహెచ్ నాగార్జున, పోలీసులు

**రెంటచింతల:** దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించడానికి కూడా పోలీసుల అనుమతి కావాలా అంటూ మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రమైన రెంటచింతలలోని ప్రధాన రహదారి వెంబడి ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించడానికి వస్తున్న మాజీ ఎమ్మెల్యే పీఆర్కేను పోలీసులు అనుమతి తీసుకోలేదని గ్రామంలోకి రాకుండా స్థానిక జాతీయ రహదారి 167 ఏడీ వద్ద అడ్డుకున్నారు. దీనిపై పీఆర్కే స్పందిస్తూ మైక్ పెట్టేందుకు, ర్యాలీలకు అనుమతులు కావాలని, కానీ దారిలో వెళ్తూ డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాల కూడా అనుమతులు కావాలని చెప్పడం మంచి పద్ధతి కాదన్నారు. దీంతో గురజాల డీఎస్పీ బీఎల్ఎస్ జగదీష్‌తో పీఆర్కే ఫోన్‌లో మాట్లాడారు. లా అండ్ ఆర్డర్ సమస్య కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు డీఎస్పీ వెల్లడించారు. సుమారు 20 నిమిషాల వరకు వేచి చూసినా పోలీసులు గ్రామంలోనికి అనుమతించక పోవడంతో పీఆర్కే వివిధ గ్రామాల నుంచి భారీగా తరలివచ్చిన వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలిసి నర్సరావుపేట కలెక్టర్ కార్యాలయం వద్ద తలపెట్టిన యువతపోరుకు తరలివెళ్లారు. ఆయన వెంట జడ్పీ వైస్ చైర్మన్ శౌంఠిరెడ్డి నర్సిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు గొట్టం బ్రహ్మారెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు నవులూరి భాస్కర్ రెడ్డి, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ మద్దిరాల కృష్ణారెడ్డి, పాలువాయి గేటు సర్పంచ్ గొలమారి శ్రీనివాసరెడ్డి, పార్టీ నాయకులు ఏరువ ప్రతాప్‌రెడ్డి, గాలి ప్రతాప్‌రెడ్డి, గొట్టం భాస్కర్‌రెడ్డి, చల్లా మల్లారెడ్డి, యర్రెద్దు శ్రీనివాసరెడ్డి, శౌంఠిరెడ్డి గురవారెడ్డి, గుండా కిశోర్, శీలం అంజయ్య తదితరులున్నారు.

## రూ.7 లక్షల రోడ్డుకు రూ. 4లక్షల కమీషన్!

- కనమర్లపూడిలో టీడీపీ నాయకుల దందా
- ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు
- గ్రామ మాజీ సర్పంచి తన్నీరు అంకారావు



కనమర్లపూడిలో జరుగుతున్న సీసీ రోడ్డు పనులు చూపుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

**శావల్యాపురం:** మండలంలోని కనమర్లపూడిలో గ్రామ పంచాయతీ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులకు స్థానిక టీడీపీ నాయకులు కమీషన్ల పేరుతో మోకాలడ్డుతున్నారని, తమకు కమీషన్లు ఇవ్వని వారిపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని గ్రామ మాజీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ నేత తన్నీరు అంకారావు ఆరోపించారు. బుధవారం గ్రామంలో రూ. 7 లక్షల వ్యయంతో బీసీ కాలనీ నుంచి వీరరాఘవులు దేవాలయం వరకు సర్పంచ్ తన్నీరు భారతి ఆధ్వర్యంలో రోడ్డు పనులకు శ్రీకారం చుట్టారు. అయితే టీడీపీ నాయకుడు గోరంట్ల హనుమంతరావు తమకు రూ. 4లక్షల కమీషన్ ఇస్తేనే పనులు కొనసాగించాలని డిమండ్ చేశారని తన్నీరు ఆరోపించారు. కమీషన్ ఇవ్వకపోవడంతో పనులు జరుగుతున్న ఏరియాలోని బీసీ కాలనీ వాసులతో స్థానిక వైఎస్సార్ సీపీ నేతలపై అక్రమ కేసులు బనాయింపజేశారని, టీడీపీ నేతల సూచనలతోనే స్థానిక పోలీసులు రంగ ప్రవేశం చేసి వైఎస్సార్ సీపీ గ్రామ నాయకులను పోలీసు స్టేషన్‌కు తీసుకొని రావటాన్ని తన్నీరు ఖండించారు. వైఎస్సార్ సీపీ మండల కో–ఆర్డినేటరు బోడెపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులకు ఇందులో వాటా ఉందని.. కమీషన్ ఇవ్వాలంటూ బీసీ సర్పంచ్‌ను టీడీపీ నేతలు బెదిరించటం దుర్మార్గమన్నారు. సీసీ రోడ్డు పనులు అడ్డుకోవడం తగదన్నారు. బోడెపూడి వెంకటేశ్వర్లు, నలబోలు శ్రీహరి, పుట్టా సురేష్, పుట్టా యోగయ్య, మర్రి ఏడుకొండలు, తదితరులు ఉన్నారు.

## రాజకీయ కక్షసాధింపులతోనే ఆత్మహత్యాయత్నం

- రాష్ట్ర ఆశ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి ధనలక్ష్మి
- గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ఆశ వర్కర్ సామ్రాజ్యంకు పరామర్శ



గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న సామ్రాజ్యాన్ని పరామర్శిస్తున్న ధనలక్ష్మి

**పెదకూరపాడు:** ఆశ కార్యకర్త రాయపాటి సామ్రాజ్యం ఆత్మహత్యాయత్నానికి కారకులను కఠినంగా శిక్షించాలని రాష్ట్ర ఆశ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి ధనలక్ష్మి డిమాండ్ చేశారు. టీడీపీ నేతల వేధింపులు తాళలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన పల్నాడు జిల్లా అమరావతి మండలం ఉంగుటూరు గ్రామానికి చెందిన రాయపాటి సామ్రాజ్యాన్ని బుధవారం గుంటూరు జీజీహెచ్‌లో పరామర్శించారు. ఈ సందర్భంగా ధనలక్ష్మి మాట్లాడుతూ గత 11 సంవత్సరాలుగా చాలీచాలని వేతనంతో ఆశ కార్యకర్తగా సక్రమంగా విధులు నిర్వహించిన సామ్రాజ్యంను గ్రామ సర్పంచ్, ఆమె భర్త సోమశేఖర్, ఆయన అనుచరులు రాజకీయ కక్ష సాధింపులకు గురిచేశారన్నారు. ఆశ కార్యకర్త ఉద్యోగాన్ని తొలగించేందుకు అనేకసార్లు ఫిర్యాదులు చేసి మనోవేదనకు గురిచేశారన్నారు. సామ్రాజ్యం విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేసిందన్నారు. అందుకే వైద్యసిబ్బంది ఇప్పటి వరకు ఏలాంటి చర్యలు తీసుకోలేదని గుర్తు చేశారు. సామ్రాజ్యం ఆత్మహత్యాయత్నానికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## అల్లుడి చేతిలో మామ హతం



**క్రోసూరు:** మండలంలోని పీసపాడు పరిధిలో పొలాల్లో మామ అల్లుడికి జరిగిన ఘర్షణలో అల్లుడు కర్రతో దాడి చేయటంతో మామ మృతిచెందిన సంఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ నాగేంద్రరావు తెలిపిన సమాచారం మేరకు సత్తెనపల్లి మండలం దీపాల దిన్నెపాలెంకు చెందిన పిల్లకతువుల గంగయ్య(గంగారాం)కు అచ్చంపేట మండలం కొండూరుకు చెందిన గంగమ్మతో ఏడు నెలల క్రితం వివాహమైంది. భార్యభర్తలు ఇరువురు తరచు ఘర్షణలు పడుతున్నారు. ఈ క్రమంలోనే మండలంలోని పీసపాడు శివారు పొలాల్లో జీవాలు మేపుకొంటున్న గంగారం, భార్య గంగమ్మకు ఘర్షణ జరగ్గా.. జరిగిన విషయాన్ని గంగమ్మ తన తండ్రి బత్తుల గంగయ్యకు, సోదరుడికి తెలియచేసింది. వారు అక్కడికి చేరుకుని గంగారంను మందలించబోయారు. దీంతో కోపోద్రిక్తుడైన గంగారం మామను కర్రతో కొట్టటంతో తలకు దెబ్బతగలటంతో గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడకు చేరుకున్న కొద్దిసేపటికే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## అగ్నివీర్ దరఖాస్తుకు ఏప్రిల్ 10 వరకు గడువు

**గుంటూరు ఎడ్యుకేషన్:** భారత సైన్యంలో అగ్నివీర్ ద్వారా వివిధ పోస్టుల భర్తీకి ఆంధ్రప్రదేశ్‌లోని 13 జిల్లాలకు చెందిన అభ్యర్థుల కోసం దరఖాస్తు ప్రక్రియ ప్రారంభించినట్లు గుంటూరులోని ఆర్మీ రిక్రూటింగ్ కార్యాలయ డైరెక్టర్ కల్నల్ పునీత్ కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. విభాగాలవారీగా www.ojinindianarmy.nic.in ద్వారా ఏప్రిల్ 10వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఒక అభ్యర్థి రెండు వేర్వేరు విభాగాల్లో దరఖాస్తు చేసుకోవచ్చునని వివరించారు. ఆన్‌లైన్ ఉమ్మడి ప్రవేశ పరీక్ష (సీఈఈ) తొలిసారిగా తెలుగుతో సహా 13 వేర్వేరు భాషల్లో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. 1.6 కిలోమీటర్ల పరుగు సమయాన్ని ఆరు నిముషాల 15 సెకన్లకు పెంచినట్లు వివరించారు. అన్ని కేటగిరీలకు సంబంధించిన ఎన్‌సీసీ ఏ, బీ, సీ సర్టిఫికెట్ కలిగిన అభ్యర్థులతో పాటు ప్రతిభావంతులైన క్రీడాకారులకు, అగ్నివీర్ టెక్నికల్ కేటగిరీ కోసం ఐటీఐ, డిప్లొమా అర్హత కలిగిన అభ్యర్థులకు అదనపు మార్కులు కేటాయించనున్నట్లు వివరించారు. గుంటూరు, కర్నూలు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, అనంతపురం, వైఎస్సార్ కడప, ప్రకాశం, చిత్తూరు, బాపట్ల, పల్నాడు, నంద్యాల, తిరుపతి, అన్నమయ్య, సత్యసాయి జిల్లాలకు చెందిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చునని సూచించారు.

## సీడ్ యాక్సిస్ రోడ్డుపై పచ్చదనం పెంచాలి

**అమరావతి అభివృద్ధి సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మీపార్థసారథి**



అధికారులతో మాట్లాడుతున్న లక్ష్మీ పార్థసారథి

**తాడికొండ:** అమరావతి రాజధానికి వెళ్లే సీడ్ యాక్సిస్ రోడ్డుపై పచ్చదనం పెంచాలని అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ) చైర్ పర్సన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డి.లక్ష్మీ పార్థసారథి అధికారులను ఆదేశించారు. సీడ్ యాక్సిస్ రోడ్డును బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవి కాలం దృష్ట్యా నాటిన మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పలు సూచనలు చేశారు. అనంతరం ఎన్–9 రోడ్డుపై బఫర్ జోన్‌ను అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక రచించాలని ఉద్యాన అధికారులను ఆదేశించారు. పర్యటనలో ఆమె వెంట ఏడీసీ జనరల్ మేనేజర్ కె శ్రీ హరిరావు, చీఫ్ ఇంజినీర్ ఎం ప్రభాకరరావు, ఉద్యాన విభాగాధిపతి వివిఎస్ ధర్మజ పాల్గొన్నారు.

## జీఎస్టీ, కస్టమ్స్ అప్పీల్స్ అడిషనల్ కమిషనర్ బదిలీ

**లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్):** గుంటూరులోని జీఎస్టీ, కస్టమ్స్ అప్పీల్స్ కార్యాలయంలో అడిషనల్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న నూతలపాటి సౌమ్య రాష్ట్ర సర్వీస్‌కు డెప్యూటేషన్‌పై బదిలీ అయ్యారు. ఈ మేరకు రింగురోడ్డు లోని అప్పీల్స్ కార్యాలయంలో బుధవారం ఆమె విధుల నుంచి రిలీవ్ అయ్యారు. గురువారం ఆమె విజయవాడలో రాష్ట్ర జీఎస్టీ అడిషనల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు.

## ముగిసిన ఎడ్ల బండలాగుడు పోటీలు

**సీనియర్స్ విభాగంలో నంద్యాల, సూర్యాపేటలకు చెందిన సంయుక్త ఎడ్ల జతకు ప్రథమస్థానం**



ఆకుల గణపవరంలో సీనియర్స్ విభాగంలో రసవత్తరంగా జరుగుతున్న పోటీలు

**రాజుపాలెం:** మండలంలోని ఆకుల గణపవరంలో వేంచేసి ఉన్న శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి 96వ జయంతి ఉత్సవాల సందర్భంగా జాతీయస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు బుధవారంతో ముగిశాయి. సీనియర్స్ విభాగంలో పోటీలు రసవత్తరంగా జరిగాయి. రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ విభాగంలో నంద్యాల జిల్లా పెదకొట్టాలకు చెందిన బోరిరెడ్డి కేశవరెడ్డి, సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌కు చెందిన సుంకి సురేంద్రరెడ్డిల సంయుక్త ఎడ్ల జత 2843 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానం కైవసం చేసుకున్నాయి. నంద్యాల జిల్లా సిరిసిల్ల మండలం గుంపరమానుదెన్నె గ్రామానికి చెందిన కుందూరు రామ్‌గోపాల్‌రెడ్డి ఎడ్ల జత 2334 అడుగుల దూరం లాగి ద్వితీయ స్థానం, పల్నాడు జిల్లా రాజుపాలెం మండలం ఇనిమెట్ల గ్రామానికి చెందిన కటికం లక్ష్మణ్‌కుమార్, మట్టంపల్లి గ్రామానికి చెందిన సృజినారెడ్డి, శ్రీధర్‌రెడ్డిల ఎడ్ల జత 2212 అడుగుల దూరం లాగి తృతీయ స్థానం, కృష్ణా జిల్లా ఘంటసాల మండలానికి చెందిన మేక కృష్ణమోహన్ ఎడ్ల జత 2118 అడుగుల దూరం లాగి నాల్గవ స్థానం, బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెంకు చెందిన అత్తోట శిరీషాచౌదరి, శివకృష్ణాచౌదరిలకు చెందిన ఎడ్ల జతల 2000 అడుగుల దూరం లాగి ఐదవ స్థానం సాధించాయి. ఎడ్ల యజమానులకు కమిటీ సభ్యులు నగదు బహుమతులు, షీల్డ్‌లను అందజేశారు.

## ఎన్జీరంగా వర్సిటీని సందర్శించిన అమెరికా ప్రొఫెసర్



**గుంటూరు రూరల్:** నగర శివారుల్లోని లాం ఫాం వ్యవసాయ పరిశోధన స్థానంలోని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని అమెరికా వ్యవసాయ విద్యాలయం ప్రొఫెసర్ ఆచార్య ఎంఎస్ రెడ్డి బుధవారం సందర్శించారు. విశ్వవిద్యాలయంలోని శాస్త్రవేత్తలు, అధ్యాపకులు, అధికారులు, విద్యార్థులతో ముఖాముఖీ చర్చల్లో పాల్గొన్నారు. విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఆర్.శారదజయలక్ష్మీదేవి మాట్లాడుతూ మన భవిష్యత్తును కాపాడుకునేందుకు మొక్కలు, నేలల ఆరోగ్యం కాపాడుకోవటంలో ప్రపంచ వ్యాప్తంగా ఉద్భవిస్తున్న సమస్యలను, ఎలా అధిగమించాలి అనే అంశాలపై ఆయనతో చర్చించారు. విదేశాల్లో చేసిన వ్యవసాయ పరిశోధనలు, వాటి వల్ల కలిగే ఉపయోగాలను ప్రొఫెసర్ ఎంఎస్ రెడ్డి వివరించారు. వ్యవసాయ విద్యార్థులకు వ్యవసాయం, వాటి మెలకువలను వివరించారు. అనంతనం విశ్వవిద్యాలయం అధికారులు ఎంఎస్ రెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, శాస్త్రవేత్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## శ్రీవారి తిరు కల్యాణం.. రమణీయం



**రేపల్లె రూరల్:** పట్టణంలోని ఉప్పూడి రోడ్డులో గల శ్రీలక్ష్మీ గోదా సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా లక్ష్మీ, గోదా సమేత వేంకటేశ్వరులకు మంగళ స్నానాలు చేయించి, వధూవరులుగా అలంకరించారు. అనంతరం వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడమ కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తిరు కల్యాణ వేడుకలను తిలకించి, స్వామికి మొక్కుబడులు చెల్లించుకున్నారు.

# శ్రీవారి కల్యాణానికి పకడ్బందీ ఏర్పాట్లు

- టీటీడీ , జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- టీటీడీ ఈఓ శ్యామలరావు ఆదేశం



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న టీటీడీ ఈఓ జె.శ్యామలరావు, వేదికపై జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎస్పీ సతీష్‌కుమార్, జేసీ భార్గవ్‌తేజ్

**తాడికొండ:** వెంకటపాలెం శ్రీవారి ఆలయ ప్రాంగణంలో ఈనెల 15న జరుగనున్న శ్రీనివాస కల్యాణానికి సంబంధించిన అన్ని పనులను సకాలంలో పూర్తి చేయాలని టీటీడీ ఈవో జె.శ్యామలరావు అధికారులను ఆదేశించారు. వెంకటపాలెంలోని ఆలయ ప్రాంగణంలో బుధవారం టీటీడీ అధికారులు, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మితో కలిసి ఆయన గుంటూరు జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. శ్యామలరావు మాట్లాడుతూ శ్రీనివాస కల్యాణంపై సమీప గ్రామాల్లో టీటీడీ ప్రచారం రథం ద్వారా ప్రచారం చేయాలని సూచించారు. భక్తులకు ఇబ్బంది తలెత్తకుండా కల్యాణ వేదిక పరిసరాల్లో అవసరమైన గ్యాలరీలు, క్యూలైన్‌లో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. శ్రీవారి ఆలయం, కల్యాణ వేదిక పరిసరాల్లో భక్తులను ఆకట్టుకునేలా విద్యుత్ అలంకరణలు చేపట్టాలన్నారు. భక్తులు సులభతరంగా స్వామిని దర్శించుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. ట్రాఫిక్ అంతరాయం తలెత్తకుండా పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని సూచించారు. కల్యాణానికి భజన బృందాలు, శ్రీవారి సేవకులను పెద్ద ఎత్తున ఆహ్వానించాలని ఆదేశించారు. జిల్లా, టీటీడీ అధికారుల కోసం ప్రత్యేకంగా జాయింట్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని చెప్పారు. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టి సీసీ కెమెరాలతో నిరంతరం భద్రతను పర్యవేక్షించాలని ఆదేశించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు సులువుగా వచ్చేందుకు వీలుగా తగినన్ని ఆర్టీసీ బస్సులు నడిపేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. స్వామి కల్యాణాన్ని నేరుగా చూడలేని లక్షలాది మంది భక్తుల సౌలభ్యం కోసం ఎస్వీబీసీ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేయాలని ఆదేశించారు. వేదిక పరిసరాలలో చెత్తను ఎప్పటికప్పుడు తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు .అత్యవసర సమయంలో తక్షణం స్పందించేలా విపత్తు నిర్వహణ బృందాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. భక్తులకు అవసరమైన వైద్య సదుపాయాలు, మందులు, సిబ్బంది, అంబులెన్సులు అందుబాటులో ఉంచాలన్నారు. భక్తులకు అన్నప్రసాదాలు, తాగు నీరు, మజ్జిగ పంపిణీ చేసేందుకు అవసరమైన శ్రీవారి సేవకులను సిద్ధం చేసుకోవాలని చెప్పారు. సాయంత్రం 4 గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడానికి తగు ఏర్పాట్లు చేయాల్సిందిగా హెచ్ డీపీపీ కార్యదర్శిని ఆదేశించారు. అనంతరం ఆయన అధికారులతో కలసి కల్యాణ వేదిక, తదితర పరిసరాల్లో జరుగుతున్న ఏర్పాట్లను పర్యవేక్షించి పలు సూచనలు చేశారు. టీటీడీ అదనపు ఈఓ సి.హెచ్.వెంకయ్య చౌదరి, జేఈఓ వీరబ్రహ్మం, గుంటూరు ఎస్పీ సతీష్ కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### ఏర్పాట్ల పర్యవేక్షణకు మంత్రుల బృందం

**సాక్షి, అమరావతి:** శ్రీనివాస కల్యాణం ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు మంత్రుల బృందం ఏర్పాటైంది. సీఎం చంద్రబాబు ఆ కార్యక్రమానికి హాజరు కానున్న నేపథ్యంలో మంత్రులు ఆనం రామనారాయణరెడ్డితోపాటు అనగాని సత్యప్రసాద్, వి.అనిత, పి.నారాయణ, కందుల దుర్గేష్‌తో కూడిన బృందం ఏర్పాట్ల పర్యవేక్షణకు గురువారం ఆలయాన్ని సందర్శిస్తారని, టీటీడీ ఈఓ కూడా అందుబాటులో ఉండాలని సూచిస్తూ దేవదాయ శాఖ కార్యదర్శి వి.వినయ్ చంద్ బుధవారం మెమో జారీ చేశారు.